సాక్షి కామారెడ్డి
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



రైతులంతా ఏకం కావాలి

సమస్యల పరిష్కారం కోసం రైతులు పార్టీలకు అతీతంగా ఏకమవ్వాలని జీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరంగారావు పిలుపునిచ్చారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /20.6

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ఓపెన్ యూనివర్సిటీలో నైపుణ్య ఉపకార ఆధారిత విద్య'



కామారెడ్డి అర్బన్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నైపుణ్య ఉపకార వేతన ఆధారిత విద్యను అందించనున్నట్లు యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కామారెడ్డి అధ్యయన కేంద్రంలో నైపుణ్య ఉపకార వేతన ఆధారిత విద్య ప్రచార పోస్టర్లను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్యతో కలిసి ఆవిష్కరించారు. రామానందతీర్థ సంస్థతో అవగాహన ఒప్పందంతో ఓపెన్ విద్యతో పాటు వివిధ ఉపాధి సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు జేడీ తెలిపారు. మహిళా సాధికారతకు వీ హబ్‌తో ఒప్పందం చేసుకున్నామని, రిటైల్ అసోసియేషన్స్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఎస్‌సీఐ) సహకారంతో ఉపకార వేతన ఆధారిత విద్య అందించనున్నామని పేర్కొన్నారు. గిరిజన తెగలు, దివ్యాంగులకు ఉచిత విద్య అందిస్తున్నామన్నారు. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, అధ్యాపకులు రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, కార్యాలయ బాధ్యుడు బాపురావు తదితరులు పాల్గొన్నారు.

'పాత కేసులు ఎత్తేస్తాం'



రాజంపేట : మండల కేంద్రంలో ఈ ఏడాది వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహిస్తే గతంలో యువకులపై ఉన్న కేసులను ఎత్తేస్తామని ఏఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. రాజంపేటలోని శ్రీలక్ష్మీనరసింహ గార్డెన్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండపాల ఏర్పాటులో పాటించాల్సిన నియమ నిబంధనలను గురించి వివరించారు. మూడేళ్లుగా ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకుంటున్న గ్రామస్తులను సీఐ సంపత్ అభినందించారు. విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వినాయక మండపాలను ఏర్పాటు చేయవద్దని ఏఈ నాందేవ్ సూచించారు. కార్యక్రమంలో గ్రామాల మండపాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'యంత్ర పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం'


కామారెడ్డి క్రైం : జిల్లాకు సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానైజేషన్–2025 పథకంలో భాగంగా పలు యంత్రాలు మంజూరయ్యాయని డీఏవో మోహన్‌రెడ్డి తెలిపారు. 4,041 బ్యాటరీ పుట్ మాన్యువల్లీ ఆపరేటెడ్ పవర్ స్ప్రేయర్‌లు, 606 పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్‌లు, 260 రొటోవేటర్‌లు, 64 సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్‌లు, 286 డిస్క్ హారో కల్టివేటర్ ఎంబీ ప్లావ్ కేజీవీల్స్, రొటోపడ్లర్‌లు, 15 బండ్ ఫార్మర్‌లు మంజూరయ్యాయన్నారు. వీటిని చిన్న, సన్నకారు మహిళా రైతులు, ఎస్సీ ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీపై, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపైన అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆరో తేదీలోగా స్థానిక రైతు వేదికలలోగానీ, మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గానీ దరఖాస్తులను అందించాలన్నారు.

'తండాల అభివృద్ధికి కృషి'



కామారెడ్డి టౌన్ : తండాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్, లంబాడా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నిర్వహించిన సమితి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎంతో చర్చించి పోడు భూములకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. లంబాడీల గోర్ బోలిని భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్‌లో జుక్కల్ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి వినోద్, జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి బద్రునాయక్, నాయకులు శ్రవణ్, లక్ష్మణ్, వినోద్, గణపతి, మదన్‌లాల్, రూప్‌సింగ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపితే జైలుకు!



- 25 రోజుల్లో 1,014 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- 13 మందికి రెండు రోజులు, 18 మందికి ఒక రోజు జైలు శిక్ష
- 281 మందికి జరిమానాలు

విస్తృతంగా తనిఖీలు..

ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అయితే పట్టణానికి నలువైపులా తనిఖీలు సాగుతున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో ఎవరినీ వదలడం లేదు. వాహనాల తనిఖీలు చేస్తున్న సందర్భంలో పోలీసులకు అనుమానం వస్తే చాలు బ్రీత్ అనలైజర్ ద్వారా టెస్ట్‌లు చేస్తున్నారు. టెస్ట్‌లో ఆల్కహాల్ ఎంత పర్సంటేజీ ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఎక్కువ మోతాదులో తాగినట్టు తేలితే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. తాగి నడపొద్దని కౌన్సెలింగ్ ఇస్తూనే మరోవైపు రిమాండుకు పంపుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ బహుముఖ వ్యూహం అమలు చేస్తోంది. ప్రమాదాలకు కారణాలను గుర్తించి చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా చాలా ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన అధికారులు.. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరో కోణమైన యాక్సిడెంట్ స్పాట్‌లను గుర్తించి వాటిని ఆయా శాఖల అధికారులతో కలిసి సరి చేయిస్తున్నారు. మరోవైపు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా ఒత్తిడి తెస్తున్నారు. హెల్మెట్ ధరించనివారికి జరిమానాలు విధిస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఒకేరోజు డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి 91 మందిని అరెస్టు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కిన వారిని రిమాండుకు పంపుతున్నారు. వారికి జరిమానాలు లేదంటే ఒకటి, రెండు రోజుల జైలు శిక్ష పడుతున్నాయి.

వాహనదారుల్లో వణుకు..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో శిక్షలు పడుతుండడంతో వాహనదారుల్లో వణుకు మొదలైంది. తాగినప్పుడు వాహనం నడపకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఏదైనా విందులో మద్యం సేవిస్తే వాహనం నడపడానికి కొందరు ఎవరో ఒకరు తాగని వాళ్లను తమ వెంట తెచ్చుకుంటున్నారు.

కఠినంగా వ్యవహరిస్తూ..

మద్యం సేవించి వాహనాలు నడిపే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఈ కేసుల్లో జరిమానాలు, ఒకరోజు, రెండు రోజుల జైలు శిక్షలు విధిస్తున్నారు. ఒక్క ఆగస్టులోనే అంటే 25 రోజుల్లో జిల్లాలో 1,014 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదవడం గమనార్హం. మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు 281 మందికి కోర్టు రూ. 1,200 చొప్పున జరిమానాలు విధించింది. 13 మందికి రెండు రోజుల జైలు శిక్ష, 18 మందికి ఒక రోజు జైలు శిక్ష విధించడంతో వారు చిప్పకూడు తినాల్సి వచ్చింది. మిగిలిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికిన ఒక వ్యక్తికి ప్లకార్డు చేతికిచ్చి రోజంతా రోడ్డుపై నిల్చోబెట్టారు. ఎవరు తాగినా ఇలాంటి శిక్షలు తప్పవనే హెచ్చరికలు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

తాగి నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడమో, వికలాంగులై జీవితాంతం బాధపడే పరిస్థితులు చూస్తున్నాం. కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, మద్యం సేవించి వాహనం నడపకుండా ఉండండి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఇతరులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది. సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే ఉద్దేశంతోనే జిల్లా పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ శాఖకు సహకరించాలి.



– రాజేశ్ చంద్ర, ఎస్పీ



ఆస్పత్రిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

వికటించిన మధ్యాహ్న భోజనం

- 22 మందికి అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక
- విచారణకు ఆదేశించిన సబ్‌కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద : శెట్లూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం వికటించింది. 26 మంది భోజనం చేయగా.. 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం చేసిన గంటకే కడుపునొప్పి, వాంతులు చేసుకున్నారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెంటనే అంబులెన్స్‌లో బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు స్వప్నాలి, కాళిదాస్ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. నీరసంగా ఉన్న విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

పరామర్శించిన సబ్ కలెక్టర్..

విద్యార్థులు అస్వస్థతకు గురైన సమాచారం తెలుసుకున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఆస్పత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. కిచిడీ, మిల్‌మేకర్, సాంబారు, గుడ్లు తిన్నామని విద్యార్థులు తెలిపారు. బియ్యంలో నల్ల పురుగులు వస్తున్నాయని, మిల్‌మేకర్ ఉడక లేదని, రంగుమారి కలుషితమైన తాగునీరు వస్తున్నాయని విద్యార్థులు సబ్ కలెక్టర్‌కు వివరించారు. చాలా రోజులనుంచి అన్నంలో పురుగులు వస్తున్నాయని, తినలేకపోతున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సబ్ కలెక్టర్ డాక్టర్లతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని తెలుసుకున్నారు. రాత్రి వేళలో శెట్లూర్‌కు వైద్య బృందాన్ని పంపించి పర్యవేక్షించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించడంతో మెడికల్ ఆఫీసర్ బృందాన్ని పంపించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలకు వెళ్లి ఫుడ్ పాయిజన్‌కు కారణాలు తెలుసుకొని నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు వెళ్లి సరఫరా అవుతున్న నీటి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. గ్రామంలో పైప్‌లైన్‌కు లీకేజీలు లేకుండా చూడాలని, రోజు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు. పురుగులు ఉన్న బియ్యం నిల్వలను వెంటనే వెనక్కి తెప్పించి, మంచి బియ్యం సరఫరా చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.



వివరాలు తెలుసుకుంటున్న హన్మంత్ సింధే

ఇబ్బందులు కలగకుండా చూడండి

- వినాయక ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : గణేశ్ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అపాయాలు కలగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులతో కలిసి పరిశీలించారు. విగ్రహాలను నిమజ్జనం చేసే అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఇరిగేషన్, మత్స్య, ఆర్అండ్‌బీ శాఖలు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. చెరువు నిండుగా ఉంది కాబట్టి నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అపశృతి జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సక్రమంగా జరిగేలా అధికారులకు సహకరించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఏర్పాట్లను కలెక్టర్ సంగ్వాన్‌కు వివరిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై చిన్నచూపు

- ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర
- కేంద్ర ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ధ్వజం

భిక్కనూరు : కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆరోపించారు. సోమవారం శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో పనుల జాతరలో భాగంగా గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక నిధులను ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల విషయంలో మాత్రం వివక్ష చూపుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఏటా నిధులను తగ్గిస్తోందన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రెండో దఫాలో ఖాళీ స్థలం, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్‌వోసీ లేఖలను, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బల్యాల సుదర్శన్, తొగరి సుదర్శన్, గాలిరెడ్డి, కుంట లింగారెడ్డి, దుర్గబాబు, శ్రీనివాస్, రమేష్, రాజు, యాదగిరి నర్సింహారెడ్డి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు చర్యలు

- ప్రతినెలా కంపెనీలను తనిఖీ చేయాలి
- అధికారులకు కలెక్టర్ సంగ్వాన్ సూచన

కామారెడ్డి క్రైం : పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ పటాన్‌చెరు సమీపంలోని సిగాచి ఇండస్ట్రీస్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 44 కార్మికులు మృత్యువాత పడిన నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 331 జీవోను విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి ప్రతినెలా తనిఖీలు చేపట్టాలన్నారు. అవసరమైన సదుపాయాలు సమకూర్చుకోవాలని కంపెనీలకు సూచించారు. పరిశ్రమల యజమానులు ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గంగారెడ్డి, జీఎం లాలూ నాయక్, అధికారులు ప్రభుదాస్, లక్ష్మీప్రసాద్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు 'పింఛన్' కిట్ల పంపిణీ

కామారెడ్డి క్రైం : పింఛన్ల పంపిణీ మరింత మెరుగ్గా జరిగేందుకు జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్‌లు, ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లు, ఇతర సాంకేతిక పరికరాలతో కూడిన కిట్లను సోమవారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ మొత్తం 211 సెట్‌లు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఆధునిక పరికరాల ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ సులువుగా జరుగుతుందన్నారు. లేదంటే మంత్ర డివైజ్ ద్వారా గానీ, ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా గానీ పింఛన్లు పంపిణీ చేయవచ్చన్నారు. అతి తక్కువ సమయంలో ఈ పరికరాలతో ఎక్కువ మందికి పింఛన్‌లు పంపిణీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.



బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌లకు పరికరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్


'మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం'

కామారెడ్డి క్రైం : మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పర్యావరణంపై అవగాహన కల్పించడానికి మట్టి గణేశ్ విగ్రహాలపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. 8 అంగుళాల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. చెరువుల్లో మట్టి మేటలని తొలగించటానికి, చెరువుల్లో స్వచ్ఛతను కాపాడటానికి కూడా ఈ విధానం ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల వితరణ

కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, బీసీ సంక్షమ అధికారి రఫీక్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ రెండు గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 15,482 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో సోమవారం రెండు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,404.57 అడుగుల (17.181 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

పీఈటీ కోసం విద్యార్థుల ధర్నా

కామారెడ్డి రూరల్ : పీఈటీ కోసం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు, విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాఠశాలలో శివరాం అనే పీఈటీ ఉండేవారన్నారు. రెండున్నరేళ్ల క్రితం ఆయనను డిప్యుటేషన్‌పై హైదరాబాద్ పంపించారని, దీంతో ఇక్కడి విద్యార్థులతో ఆటలు ఆడించేవారు లేకుండాపోయారని పేర్కొన్నారు. కలెక్టర్, డీఈవోలను కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. వెంటనే శివరాం డిప్యుటేషన్ రద్దు చేసి, ఇక్కడికి రప్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఆదర్శ పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

క్లుప్తంగా

గురుకుల పాఠశాల పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆర్డీవో పార్థసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఎండ్రియాల్‌లో పంటలు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎండ్రియాల్, చందాపూర్ శివారులో పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి నర్సింలు పరిశీలించారు. ఖరీఫ్‌లో వేసిన సోయా, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలుసూచనలు చేశారు.

మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడి తొలగింపు

కామారెడ్డి అర్బన్: మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ లింగంపేట మండలం మోతె ప్రాథమిక మత్స్యకారుల సంఘంలోని ఆయన ప్రాథమిక సభ్యత్వం తొలగించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ నివాసంపై ఆరోపణలు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి ద్వారా విచారణ జరిపి రేషన్ కార్డు, ఆధార్, ఓటర్ గుర్తింపు, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకుని నివాస స్థితిని ధ్రువీకరించినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం సొసైటీ పరిధిలోని గ్రామాల్లో నివసించే వారికే సభ్యత్వం ఉంటుందన్నారు. మోతెలో నివాసించనందున సొసైటీలో సభ్యత్వం రద్దు చేసినట్లు వివరించారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా గాదె తిరుపతి, ఉపాధ్యక్షులుగా పేశెట్టి లక్ష్మీనారాయణ, కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, రవి, దేవేందర్, రాజు, రాములు, కోశాధికారిగా మైదపు శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ప్రజావాణికి 92 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, పింఛన్‌లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ.. ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేవన్నారు. ఏమైనా సమస్యలుంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీవో సయ్యద్‌సాజీద్‌అలీ, ఎంపీవో సవిత, ఏపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలుగా సర్టిఫికెట్లు ఇవ్వాలి



ఆర్డీవో వీణకు వినతిపత్రం అందజేస్తున్న బేడ బుడగ జంగం సంఘం సభ్యులు

తమను బేడ బుడగ జంగాలుగా గుర్తించాలని మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం సంఘం ప్రతినిధులు కోరారు. తమ పూర్వీకుల అవగాహనా లోపం కారణంగా గతంలో తాము గోసంగి కులంలో కొనసాగామని తెలిపారు. వాస్తవానికి తాము బేడ బుడగ సంఘం వారమన్నారు. స్థానిక అధికారులు తమకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బేడ బుడగ జంగాలుగా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో సోమవారం జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు దాదాపు 50 మంది వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 29న హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు పలువురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. రికర్వు రౌండ్ జూనియర్ విభాగంలో బి. హిందు, హర్షిణి .. ఇండియన్ రౌండ్ జూనియర్ విభాగంలో ఎస్‌కే రేహన్, అకుల్, ప్రీతి, సహస్ర, ఇండియన్ రౌండ్ సబ్ జూనియర్ విభాగంలో శ్రీజ, వకులదేవి ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



గాంధారి(ఎల్లారెడ్డి): వినాయక నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల వద్ద డీజేలను పూర్తిగా నిషేధించామని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్సై ఆంజనేయులు అన్నారు. సోమవారం డీజే యజమానులు, డీజేల నిర్వాహకులను తహసీల్దార్ రేణుకా చౌహాన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం



కామారెడ్డి క్రైం: పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భరోసా కేంద్రం ఆయా కేసుల్లో బాధితులుగా ఉన్న మహిళలు, చిన్నారులకు అండగా నిలుస్తుందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోక్సో కేసుల్లో బాధితులుగా ఉన్న ఇద్దరికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత మహిళలు, చిన్నారులకు భద్రత, మనోధైర్యం, న్యాయ సహకారాలు అందిస్తూ విశ్వసనీయంగా సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. అందించిన ఆర్థిక సహాయం ద్వారా బాధితులు పునరావాసం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్య, వైద్యం లాంటి అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



బాన్సువాడ రూరల్: పండుగలను ప్రశాంత వాతావరణంలో సామరస్యపూర్వకంగా జరుపుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. సోమవారం బాన్సువాడ మండల కార్యాలయంలో డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐ అశోక్‌లతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవిస్తూ గణేష్ చవితి పండుగతో పాటు, శోభాయాత్ర, నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. దీనికోసం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉంటూ పోలీస్, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులకు సహకారం అందించాలన్నారు. మండపాల వద్ద 24 గంటల పాటు ఎవరో ఒకరు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ విఠల్‌రెడ్డి హెచ్చరించారు.

నానో యూరియా లాభదాయకం



బాన్సువాడ రూరల్: నానోయూరియా స్ప్రే రైతులకు ఎంతో లాభదాయకమని కోనాపూర్ క్లస్టర్ ఏఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన బోర్లం సొసైటీ చైర్మన్ సంగ్రాం నాయక్‌తో కలిసి హన్మాజీపేట్, సంగ్రాంతండాల్లో వరి పొలాలను పరిశీలించారు. రైతులకు నానో యూరియా ప్రాముఖ్యత గురించి వివరించారు. అరలీటర్ నానోయూరియా ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. పర్యావరణ హితమైన నానో యూరియా స్ప్రే చేయడం వల్ల వరి మొక్క త్వరగా నత్రజనిని గ్రహించుకుంటుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ఆకుముడత పురుగు ఉధృతి ఉందన్నారు. పురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ లేదంటే క్లోరాంట్రానిపోల్ 0.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే దేశాయిపేట్ క్లస్టర్ ఏఈవో దత్తేశ్వరి.. గ్రామంలోని పంటపొలాల్లో రైతులతో కలిసి పర్యటించారు. గాలిలో తేమశాతం వల్ల బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించాయన్నారు. దీని నివారణకు 15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. ప్లాంటామైసిన్ 20 గ్రాములతో పాటు కాపర్ హైడ్రాక్సైడ్ 600 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల ఉధృతి తగ్గుముఖం పడుతుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి గంట పాటు ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ.. ఆశాలకు ఆదివారం సెలవుగా ప్రకటించాలని, అధికారులు, ఏఎన్‌ఎంలు వేధింపులు మానుకోవాలన్నారు. కనీస వేతనం రూ.18వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లోని వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రైతులంతా ఏకం కావాలి



గాంధారిలో మాట్లాడుతున్న శ్రీరంగారావు

గాంధారి(ఎల్లారెడ్డి): రాజకీయాలు, కులమతాలకు అతీతంగా రైతులందరూ ఏకమై సమస్యల పరిష్కారానికి పోరాడాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరంగారావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీకేఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో స్థిరపడ్డవారు ఆర్థికంగా ఎదుగుతున్నారని, రాత్రింబవళ్లు ఎండనకా, వాననకా కష్టపడే రైతులు మాత్రం ఆర్థికంగా, మానసికంగా కృంగిపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన మార్కెట్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపారులు విత్తనాలు, పురుగు మందులను వారి ఇష్టమొచ్చిన ధరలకు విక్రయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారానికి రైతులంతా ఏకమై ప్రభుత్వంతో పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్ రావు, విఠల్‌రెడ్డి, శంకర్‌రావు, రావు సాహెబ్‌రావు, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో 45 ఏళ్ల మైలురాయి గొప్ప విషయం



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ రాజకీయాల్లో 45 ఏళ్ల మైల్‌రాయిని దాటడం గొప్ప విషయమని పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరులో షబ్బీర్‌అలీని ఆయన సత్కరించి మాట్లాడారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చి తొలిసారిగా ఎమ్మెల్యే పదవికి పోటీచేసి గెలిచి మంత్రివర్గంలో స్థానం సాధించారన్నారు. రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలను షబ్బీర్‌అలీ పొందారన్నారు. కామారెడ్డి పట్టణానికి మంచినీటిని తన హయాంలో అందించి అపరభగీరథుడిగా షబ్బీర్‌అలీ పేరు పొందాడని కొనియాడారు. డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గొండ్ల సిద్ద రాములు, సింగిల్ విండో చైర్మన్లు గంగళ్ల భూమయ్య, నాగరాజురెడ్డి, పూల్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి సజ్జనపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3,220 నగదుతోపాటు 4 ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.


మంజీరలో చిక్కుకున్న వ్యక్తి

- కాపాడిన తోటి రైతులు



బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామానికి చెందిన జంబిక సాయిలు అనే వ్యక్తి సోమవారం మంజీరా నదిలో చిక్కుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నదికి ఆనుకుని ఉన్న పొలంలో నీళ్లు చూసేందుకు వెళ్లాడు. అదే సమయంలో నిజాంసాగర్ ప్రాజెక్టు 12 గేట్ల నుంచి నీటిని వదలడంతో రైతు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. సాయిలు గ్రామస్తులతోపాటు 100 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం కోరడంతో స్పందించిన బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తోటి రైతులు ఖమ్రోద్దీన్, చందునారాయణ, చాకలి అంజయ్యలు సుమారు 300 మీటర్లు ఈత కొట్టుకుంటూ నదిలోకి వెళ్లి సాయిలును కాపాడారు. కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, పృథ్వి సహాయక చర్యలు పర్యవేక్షించారు. రైతు క్షేమంగా ఒడ్డుకు చేరడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. తోటి రైతులు చేసిన ధైర్య సాహసాలను పలువురు ప్రశంసించారు.

ఆర్టీసీ బస్టాండ్ నూతన భవనాన్ని నిర్మించాలి



బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరిందని, అదే స్థలంలో నూతన భవనాన్ని నిర్మించాలని బీజేపీ నాయకులు సోమవారం ఆర్టీసీ డీఎం సరితాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో ఇటీవల క్యాంటీన్‌లో పైకప్పు కూలిపోయిందని.. అదృష్టవశాత్తూ ప్రయాణికులకు గాయాలు కాలేదన్నారు. వెంటనే బస్టాండ్‌ను కూల్చి వేసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. నాయకులు చిరంజీవి, చీకట్ల రాజు, ఉమేష్, గజ్జల మహేష్, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, గంగారాం, నాగరాజు తదితరులున్నారు.

బోరు మోటార్ల దొంగలను పట్టుకున్న రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజర, ధర్మారెడ్డి గ్రామ శివారుల్లో బోరు మోటార్లను చోరీ చేసి పారిపోతున్న ఇద్దరిని స్థానిక రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ కథనం ప్రకారం..గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన గౌస్ పాష, మోసిన్ అనే ఇద్దరు వ్యక్తులు రెండు బైక్‌లపై వచ్చి మండలంలోని బంజర ఫంక్షన్‌హాల్ సమీపంలో పంట పొలాల నుంచి బోరుమోటార్లను చోరీచేసి ఎల్లారెడ్డి వైపు వెళ్లారు. అలాగే ధర్మారెడ్డి గ్రామ శివారులోనూ పంట పొలాల నుంచి బోరుమోటార్లను ఎత్తుకెళ్లే సమయంలో స్థానిక రైతులు గమనించి వారిని పట్టుకొని నాగిరెడ్డిపేట పోలీసులకు అప్పగించారు. ధర్మారెడ్డి గ్రామానికి చెందిన తెనుగు రమేష్ అనే బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

రుద్రూర్: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పోతంగల్ మండల కేంద్రంలో జరిగింది. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతంగల్ గ్రామానికి చెందిన మొండి రాములు ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని రెండున్నర తులాల బంగారం, 38 తులాల వెండి ఆభరణాలు దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (35) ఉరేసుకొని మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూ రంగు టీ షర్టు, నేవీ బ్లూ రంగు ప్యాంట్ ఉందని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లభించలేవని, మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రైయినేజీలో పడి ఒకరు..



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీలో నివాసముండే గులాం జిలానీ(50) ప్రమాదవశాత్తు తాడ్కోల్ శివారులోని బీడీ వర్కర్స్ కాలనీలోని డ్రైయినేజీలో పడి మృతి చెందాడు. బాన్సువాడలోని ఓ హోటల్‌లో పనిచేసే జిలానీ శుక్రవారం రాత్రి పని ముగించుకొని ఇంటికి బయల్దేరాడు. ఆదివారం రాత్రి వరకు అతని ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం కాలనీలో దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని జిలానీగా గుర్తించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య షహనాజ్ ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..



సిరికొండ: మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెల్లం లక్ష్మి (60) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష్మి, ఆమె భర్త నడ్పి గంగయ్య కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రామంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం వీరి వాహనానికి తగిలింది. దీంతో భార్యాభర్తలు వాహనంపై నుంచి కిందపడిపోయారు. గాయాలపాలైన లక్ష్మిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



శ్రీనివాస్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబీకులు

నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామ శివారులో ఉన్న పంట పొలాల్లో విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొబ్బిలి శ్రీనివాస్(39) నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్-రే టెక్నీషియన్ గా పనిచేస్తాడు. భార్య ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగం చేస్తుంది. శ్రీనివాస్ సోమవారం ఉదయం పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఉదయం వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా పంట కాలువలో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పొలానికి స్ప్రే చేయడానికి మందులు తీసుకొని వచ్చి, బోరు ఆగిపోయి ఉండటంతో శ్రీనివాస్ స్టార్టర్ బాక్సులోని మూడు ఫ్యూజులలో ఒక ఫ్యూజు మాత్రమే తీసి బోరును ముట్టుకుని ఉన్నాడు. బోరు మోటారు నుంచి విద్యుత్ సరఫరా కావడం, పంట కాలువలో నీరు ఉండటంతో షాక్ తగిలి అక్కడికక్కడే షాక్ మృతి చెందాడన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాఘవేంద్ర పరిశీలించి మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమ్య, కూతురు పర్ణిత, కొడుకు రియాంత్ ఉన్నారు.

నాన్నా... అంటూ చిన్నారి ఏడుపు

పొలాల మధ్య నుంచి శ్రీనివాస్ మృతదేహాన్ని రోడ్డుపైకి స్థానికులు తీసుకుని వచ్చారు. అప్పుడే పాఠశాల నుంచి వచ్చిన కూతురు పర్ణిత నాన్నా అంటూ ఒక్కసారిగా ఏడవడంతో స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

కోతుల దాడిలో గాయపడ్డ వృద్ధుడు మృతి



కర్రె సిద్ధయ్య (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కోతుల దాడిలో గాయపడ్డ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన కర్రె సిద్ధయ్య (65)ను ఈ నెల 17న ఇంటి వద్ద కోతులు దాడి చేశాయి. దీంతో కిందపడిన ఆయన తుంటి ఎముక విరిగింది. వెంటనే కుటుంబీకులు ఆయనను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన సిద్ధయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు బాబు, నలుగురు కుమార్తెలు లక్ష్మి, రేణుకా అనిత, లావణ్య ఉన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. కేసులో బాధితురాలైన మహిళ తన తల్లితో కలిసి బాన్సువాడలో నివసించేది. 2023 మార్చి 28న ఇంటి నంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాధితురాలి అన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోమేశ్వర్ గ్రామానికి చెందిన బండారి మొగులయ్య అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వారి స్వగ్రామానికి తీసుకువెళ్లి బాధితురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అదే సమయంలో అప్పటికే నిందితునితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న పార్వతి భారతి అనే మహిళ అక్కడకు వచ్చి అసూయతో బాధితురాలిపై దాడి చేసి గాయపర్చింది. దీంతో పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సోమవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ నిందితుడికి పదేళ్ల కఠిన జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా, బాధితురాలిపై దాడి చేసిన పార్వతి భారతికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారించి, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన సీఐలు మహేందర్ రెడ్డి, అశోక్, ఏపీపీ సూర్యప్రసాద్, లైజనింగ్ అధికారి ఎస్సై రాజయ్య, ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బంది సాయిలును ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు.